

ఇంక్యుబేషన్ సెంటర్ స్థాపనే లక్ష్యం

నూజివీడు ఆర్‌జియుకెటి, పరాబోలా-9 మధ్య ఒప్పందం

నూజివీడు టౌన్ : నూజివీడు ఆర్‌జియుకెటిలో ఒక ఇంక్యుబేషన్ సెంటర్‌ను స్థాపించడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ప్రాజెక్ట్‌లను ప్రోత్సహించడం లక్ష్యంగా పరాబోలా-9 కంపెనీ, నూజివీడు ఆర్‌జియుకెటిల మధ్య ఈ నెల 15న ఒప్పందం కుదిరింది. ఆర్‌జియుకెటి డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్, పరాబోలా-9 కంపెనీ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ ప్రణవ్‌మూర్తి సమక్షంలో ఒప్పందం ఖరారైంది. ఇందులో భాగంగా అక్టోబర్ 15, 16 తేదీల్లో హ్యాకథాన్ నిర్వహించారు. 12 జట్లు పోటీలో పాల్గొని తమ వినూత్న పరిష్కారాలను ప్రదర్శించాయి. ఈ ఈవెంట్‌లో మొదటి స్థానంలో నిలిచిన జట్టు రూ.16 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టు రూ.ఎనిమిది వేలు గెలుపొందాయి. ఇందులో భాగంగా సిఎస్‌ఇ విభాగం నుంచి 15 మంది ఇ-4 విద్యార్థులు పరాబోలా-9 కంపెనీకి ఎంపికయ్యారు.

ఇసు(క)గెత్తిపోతున్నారు..!

మాయాపర్వంలా ఇసుక ఆన్‌లైన్ బుకింగ్
ఎప్పుడు చూసినా ఆన్‌లైన్‌లో నో శ్యాండ్ డిస్‌ప్లే
ఏలూరు, పశ్చిమలో ఒక్క ఇసుక ర్యాంపూ తెరవని పరిస్థితి
ఇబ్రహీంపేటలో 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉందని ప్రకటన
ఆన్‌లైన్‌లో మాత్రం నో బుకింగ్..
లబోదిబోమంటున్న నిర్మాణదారులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం చెబుతున్న ఉచిత ఇసుక సరఫరా బూటకమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక సామాన్యులకు అందని ద్రాక్షగా మారిపోయింది. గతంలో ఎన్నడూ ఇటువంటి దారుణ పరిస్థితులను ఎదుర్కోలేదనే చర్చ జనాల్లో సాగుతోంది. ప్రభుత్వం, జిల్లా అధికారులు చెబుతున్న మాటలకు, వాస్తవ పరిస్థితికి ఎటువంటి సంబంధమూ లేకుండాపోయింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజానీకం ఇసుక కోసం ఆన్‌లైన్ సెంటర్ల చుట్టూ తిరిగితిరిగి విసిగెత్తిపోతున్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఓపెన్ ఇసుక ర్యాంపులు ప్రారంభిస్తున్నాం, ఇక ఇసుక కష్టాలు ఉండవని ప్రభుత్వం చెప్పిన మాటలన్నీ వట్టి మాటలుగా మారిపోయాయి. ఇసుక బుకింగ్ కోసం జనం పడుతున్న పాట్లు రోజురోజుకు వర్ణనాతీతం. తూర్పుగోదావరి జిల్లాలోని ర్యాంపులు, స్టాక్‌పాయింట్లలో నోశ్యాండ్ అంటూ ఆన్‌లైన్‌లో చూపిస్తుండగా, ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట స్టాక్‌పాయింట్‌కు సంబంధించి ఇసుక బుకింగ్ కాని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచినా ఇసుక సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలంలో చేబ్రోలు స్టాక్‌పాయింట్, కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట, విజరం స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక సరఫరా జరుగుతుందని జిల్లా అధికారులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు లేవని, తూర్పుగోదావరి జిల్లాలో పెరవలి, నిడదవోలు, రావులపాలెంలో ఉన్న స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక తెచ్చుకోవచ్చునని చెప్పుకొచ్చారు. చేబ్రోలు స్టాక్‌పాయింట్‌లో తొలి నుంచి ఇసుక లేకుండాపోయింది. ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్‌లో ఇసుక జనాలకు అందుబాటులోకి లేకుండాపోయింది. ఇసుక ఎటు పోతుందో ఎవ్వరికీ అర్థం కాని మిస్టరీగా మారింది. జనం నుంచి తీవ్ర విమర్శలు రావడంతో సెప్టెంబర్ 19 నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ విధానం తెచ్చారు. ఇంతవరకు సామాన్యులకు ఇసుక అందని పరిస్థితి నెలకొంది. ఎప్పుడు చూసినా ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ అయిపోయినట్లు చూపిస్తోంది. దీంతో జనాలకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఇబ్రహీంపేట పాయింట్‌లో ఇంకా 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇసుక మాత్రం బుకింగ్ కావడం లేదు. అదేమని అడిగితే రోజుకు 800 మెట్రిక్ టన్నుల వరకూ మాత్రమే బుకింగ్ జరుగుతుందని, ముందుగానే అంతా బుక్ అయిపోతుందని చెబుతున్న పరిస్థితి. ఆన్‌లైన్ బుకింగ్ అంతా ఒక మాయాపర్వంలా సాగుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇసుక లేక సామాన్యులకు సంబంధించిన ఇంటి నిర్మాణ పనులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. భవన నిర్మాణ కార్మికులకు నెలలో సగం రోజులు కూడా పని ఉండటం లేదు. ఇసుక సమస్య ఎప్పటికి తీరుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

ఒక్క ర్యాంపూ ఓపెన్ కాని పరిస్థితి

ఈ నెల 16వ తేదీ నుంచి ఓపెన్ ఇసుక రీచ్‌లు అందుబాటులోకి వస్తాయని, ఇసుక కష్టాలు ఇక ఉండబోవని ప్రభుత్వం చెప్పింది. ఈ నెల 16న రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఇసుక ర్యాంపులు ఓపెన్ చేసినట్లు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలోని పోలవరం మండలంలోని గూటాల, పట్టిసీమల్లో ఇసుక ర్యాంపులు ఉన్నాయి. వీటిలో ఒక్కటి కూడా ఓపెన్ కాలేదు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలంలో కరుగోరుమిల్లి, కోడేరు ర్యాంపులు, పెనుగొండ మండలం సిద్ధాంతంలోని రెండు ర్యాంపులు, నరసాపురం మండలంలోని ర్యాంపులు ఓపెన్ కాలేదు. స్టాక్ పాయింట్లలో ఇసుక దొరక్క, ఓపెన్ రీచ్‌లు తెరవకపోవడంతో ఇసుక సమస్య తీవ్రతరమైంది.

బ్లాక్‌లో ఇసుక అమ్మకాలు..

ఆన్‌లైన్ బుకింగ్‌లో సామాన్యులకు ఇసుక దొరకడం లేదు. బ్లాక్‌మార్కెట్‌లో మాత్రం ఇసుక అమ్మకాలు సాగుతున్నాయి. జిపిఎస్ విధానం ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మరి ఇసుక బ్లాక్ మార్కెట్‌లోకి ఎలా వస్తుందో అధికారులు చెప్పాల్సి ఉంది. 20 టన్నుల ఇసుక రూ.29 వేలకు బ్లాక్‌మార్కెట్‌లో అమ్మకాలు సాగుతున్నాయి. దీంతో ఇదేం ఉచిత ఇసుక విధానం అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


డిఇఒ కార్యాలయం సత్యాగ్రహ దీక్ష చేపట్టిన యుటిఎఫ్ నేతలు

సమస్యలు పరిష్కరించాలని సత్యాగ్రహ దీక్ష

యుటిఎఫ్ ఆధ్వర్యాన మున్సిపల్ ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ ఉపాధ్యా యుల సమస్యల పరిష్కారం కోరుతూ యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యం లో గురువారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. అనంతరం డిఇఒ కార్యాలయంలో ఎడి-1 అవధానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ ఖాతాలు తెరవాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని, మున్సిపల్ యాజమాన్యంలో పండిట్, పిఇటి పోస్టు అప్‌గ్రేడేషన్ చేసి ప్రమోషన్లు ఇవ్వాలని, మున్సిపాల్టీలో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ హెచ్‌ఎంల్లో అర్హులైన వారిని అర్బన్ ఎంఇఒలుగా నియమించాలని, మున్సిపల్ పాఠశాలలో నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించాలని, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని, వర్గోన్నతి చెందిన అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల పోస్టులు మంజూరు చేయాలని కోరారు. అంతేకాక వర్క్‌అడ్జస్టుమెంట్‌లో సుదూర ప్రాంతాలకు 50 కిలోమీటర్లు దాటి వేరే మేనేజ్‌మెంట్‌లోకి పంపించిన ఎస్‌జిటి ఉపాధ్యాయులను తిరిగి మున్సిపల్ యాజమాన్యంలో అవసరమైన ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న పెద్దఎత్తున విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ సత్యాగ్రహ దీక్షలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, మున్సిపల్ వింగ్ కన్వీనర్ ఇ.శివశంకరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, ఏలూరు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ పర్వీన్ బేగం, జొన్నకూటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల నిష్పత్తిని పెంచాలి

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిరోధానికి స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

బేటీ బచావో.. బేటీ పడావో పథకం ద్వారా జిల్లాలో ఆడపిల్లల లింగ నిష్పత్తిని పెంచడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన జిల్లాలో అమలు చేస్తున్న మిషన్ శక్తి పథకంలో వన్‌స్టాప్ సెంటర్ కార్యక్రమాలు, బేటి బచావో.. బేటి పడావో ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై త్రైమాసిక సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ బేటీ బచావో బేటి పడావో పథకం ద్వారా జిల్లాలో అమలవుతున్న 18 సంవత్సరాలు పైబడిన మహిళలకు సంబంధించి నిరాశ్రయులై, నిరాదరణకు గురై, అత్యాచారాలకు గురై, గృహహింసకు గురైన మహిళలకు అందిస్తున్న సేవల్లో గణనీయమైన మార్పులు తీసుకురావాలన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో ఆడపిల్లల లింగ నిష్పత్తిని పెంచడానికి భ్రూణహత్యలు నివారించడానికి, ఆడపిల్లల స్కూల్ రిజిస్ట్రేషన్ సంఖ్యను పెంచడానికి గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. లింగ వివక్షకు తావు లేకుండా ఆడపిల్లలను చదివిద్దాం.. ఆడపిల్లలను బతికిద్దాం అనే నినాదంతో ముందుకెళ్లే కార్యక్రమాలను రూపొందించాలన్నారు. వన్‌స్టాప్ సెంటర్ ద్వారా ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు అందిన కేసుల వివరాలను పరిశీలించి వారికి మరింత సౌకర్యవంతమైన సహాయ సహకారాలు అందించాల న్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ సాధికారత అధికారి కెఎల్.పద్మావతి, డిసిపిఒ డాక్టర్ సిహెచ్.సూర్యచక్రవేణి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ నిర్మల, డిపిఒ దుర్గాప్రసాద్, పీడీ ఆఫీస్ ఇఒ వి.మల్లిక, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు

దేశ సంస్కృతీ, సంప్రదాయాలను యువత కాపాడాలి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడే గురుతరమైన బాధ్యత యువతపై ఉందని జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. గురువారం స్థానిక సిహెచ్‌ఎస్‌డి సెయింట్ థెరిస్సాస్ (అటానమస్) మహిళా కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు-2024 నిర్వహించారు. ముఖ్యఅతిథి జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ జ్యోతి ప్రజ్వలన చేసి యువజనోత్సవాలను ప్రారంభించారు. అనంతరం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ సంస్కృతీ సంప్రదాయాలను యువత కాపాడాలన్నారు. యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కళా ప్రదర్శనల ద్వారా జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయిలోకి తీసుకెళ్లాలన్నారు. విద్యార్థి దశ నుండే విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని దేశానికి, రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడు ఎక్కువగా చెడు ప్రభావానికి చాలామంది లోనవుతారని, చెడుదారిన పోకుండా మంచి మార్గంలో ఉండి ఉన్నతమైన శిఖరాలు అధిరోహించడం ద్వారా తల్లిదండ్రులకు ఎంతో మేలు చేసేవారవుతారన్నారు. ప్రభుత్వం అందరికీ విద్య అందించాలని, వారికి మంచి భవిష్యత్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థీ తమ లక్ష్యాలను చేరుకోవడానికి పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. సెట్‌వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకరరావు మాట్లాడుతూ రానున్న జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జానపద నృత్యం గ్రూపు, జానపద గీతం గ్రూపు, సోలో, కవిత్వం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, వక్తృత్వ అంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ ఆఫీసర్ డి.కిషోర్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎన్ఎస్.కృపావరం, జిల్లా ఉపాధికల్పనాధికారి సి.మధుభూషణరావు, ప్రభుత్వ ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపల్ రజిత, ఆర్టిస్టు ఎం.కాంతారామ్, మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ వాసు, ఎమ్‌డి ఖాజావలీ, జి.ప్రవీణ్‌కృష్ణ, గండికోట రాజేష్, సిహెచ్‌ఎస్‌డి సెయింట్ థెరిస్సాస్ (అటానమస్) మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మెర్సీ, టూరిజం అధికారి పట్టాభి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాట వేసి నివాళుర్పిస్తున్న పద్మశ్రీ

భూసేకరణలో అభ్యంతరాలను పరిష్కరిస్తాం

జెసి ధాత్రిరెడ్డి


మండల పరిషత్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 365 కోసం చేపట్టిన భూసేకరణలో భూయజమానుల అభ్యంతరాలన్నింటినీ పరిశీలించి, పరిష్కరిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం భూసేకరణపై రెవెన్యూ అధికారులు, భూయజమానులతో సమావేశం నిర్వహించారు. భూసేకరణపై భూయజమానులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి రికార్డులను పరిశీలించారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి నిబంధనల ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో సేకరిస్తున్న భూముల్లో ఎల్‌టిఆర్ వివాదాలు, గిరిజన, గిరిజనేతర వివాదాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భూసేకరణలో నమోదు కాని భూ వివరాలను తిరిగి నమోదు చేసి ఆయా భూముల యజమానులకు నష్టపరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీనికోసం కొత్త నోటిఫికేషన్ ఇస్తామని తెలిపారు. భూసేకరణ వ్యవహారమంతా పారదర్శకంగా నిర్వహించడం కోసం స్థానిక రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఎక్కువ సమయం కేటాయించి, ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. జీలుగుమిల్లి నుండి పట్టిసీమ వరకు మూడు మండలాల నుండి వెళ్తున్న ఈ జాతీయ రహదారి 12 గ్రామాలను కలుపుకుంటూ 40 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుపుకుంటుందని స్పష్టం చేశారు. ఈ రహదారి నిర్మాణం కోసం సేకరిస్తున్న 250 ఎకరాల్లో 150 ఎకరాలు జిరాయతీ భూములని, మిగిలిన వంద ఎకరాలు ప్రభుత్వ భూములని చెప్పారు. బుట్టాయగూడెం మండలంలో 34 ఎకరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుట్టాయిగూడెం తహశీల్దార్ చలపతిరావు, డిప్యూటీ తహశీల్దార్ పాయం రమేష్, సీనియర్ అసిస్టెంట్ గంగరాజు, నేషనల్ హైవే తహశీల్దార్ పోతురాజు, డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్, విఆర్‌ఒ తెల్లం పోతురాజు పాల్గొన్నారు.

మహనీయుల జీవిత చరిత్రలు తెలుసుకోవాలి

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలో కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా వారి మార్గంలో పయనించి అనుకున్న లక్ష్యాలను సునాయాసకంగా సాధించగలుగుతారని, అందుకు వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర నిదర్శనమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో గురువారం జిల్లా బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మికి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మికి మహర్షి చిత్రపటానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, జిల్లా రజక సంఘం అధ్యక్షులు సిహెచ్.కట్లయ్య, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సంస్కృతంలో రామాయణాన్ని ఆదికావ్యంగా రాసిన వాల్మికి మహర్షి ఆదికవిగా నిలిచారన్నారు. మహర్షి వాల్మికి గుణగణాలను జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, జిల్లా రజక సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్.కట్లయ్య, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, బిసి కార్పొరేషన్ ఇడి డి.పుష్పలత, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎన్ఎస్.కృపావరం, డిపిఒ కె.అనురాధ, సెట్ వెల్ సిఇఒ కె.ప్రభాకరరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి, పశు సంవర్ధక శాఖ జెడి జి.నెహ్రూబాబు, ఎపిఎంఐపి పీడీ రవికుమార్, సెరీ కల్చర్ డీడీ డి.వాణి పాల్గొని మహర్షి వాల్మికి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బుట్టాయగూడెం రూరల్ : గిరిజనులు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించి మెరుగైన ధర కల్పిస్తామని జెసి, ఐటిడిఎ పిఒ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. కన్నాపురంలో గెడ్డపల్లి గ్రామా గిరిజనులచే ఏర్పాటు చేసిన ప్రకృతి వన్‌ధన్ వికాస్ కేంద్రాన్ని ఆమె గురువారం సందర్శించారు. అనంతరం కెఆర్.పురం ఐటిడిఎ కార్యాలయంలో మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐటిడిఎ మీటింగ్ హాలులో డివిజినల్ అధికారులతో వన్‌ధన్ వికాస కేంద్రాల (విడివికె), గిరిజన సంఘాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి ఉద్దేశించిన పిఎం జన్‌మాన్, ఇంజినీరింగ్ పనులు, గిరిజన సంక్షేమ విద్యపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పిఎం జన్‌మాన్ పథకంలో భాగంగా అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించి అన్ని పివిటిజి గ్రామాల్లో నూరుశాతం లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ పివిఎస్.నాయుడు, వెలుగు ఎపిడి ఏజెన్సీ మండలాల ఎపిఎంలు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

'పల్లె పండుగ' నిధులు పక్కదారి

నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పల్లె పండుగ కార్యక్రమం నిధులను పక్కదారికి మళ్లిస్తున్న నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మంగరాజు డిమాండ్ చేశారు. నిధుల దుర్వినియోగం విషయంపై బుట్టాయగూడెం ఎంపిడిఒ జ్యోతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ మండలంలోని రెడ్డి గణపవరం గ్రామపంచాయతీలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజూరు చేసిన రూ.20 లక్షలను పంచాయతీలోని గిరిజనేతర ప్రాంతాల్లో, వ్యక్తిగత ప్రయోజనాల కోసం సీసీ రోడ్ల నిర్మాణం చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఒక పార్టీ నాయకుడి ఇంటికి 130 మీటర్ల రోడ్డును నిర్మాణం చేస్తున్నారని, ఆ రోడ్డులో ఏ విధమైనటువంటి ఇతర జనావాసాలు లేవని తెలిపారు. కేవలం ఒక వ్యక్తి ఇంటి కోసం సుమారు రూ.ఐదు లక్షలు ఖర్చు చేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగ పరచడమేనని తెలిపారు. నిధుల దుర్వినియోగం పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సమస్యను పరిష్కరిస్తానని, పల్లె పండుగ నిధులను గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ వారోత్సవాల నిధులు మొదటి ప్రాధాన్యత గిరిజన ప్రాంతాలకు ఇస్తామని స్వయంగా ఎంఎల్‌ఎ హామీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సిపిఎం గ్రామ నాయకుడు జి.పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం, గిరిజన నివాస ప్రాంతాల మౌలిక సౌకర్యాల కోసం గ్రామసభలో చేసిన తీర్మానాలను తారుమారు చేసి గిరిజనేతర ప్రాంతాలకు నిధులు మళ్లించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గిరిజన ప్రాంతాలకు కేటాయించిన పల్లె పండుగ నిధులను దారి మళ్లించడం, గ్రామసభ తీర్మానాలను తారుమారు చేయటం చట్ట విరుద్ధమన్నారు. గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తున్న అధికారులపై, రాజకీయ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. పల్లె పండుగ నిధులను పారదర్శకంగా ఖర్చు చేయాలని, గిరిజన ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి గణపవరం గ్రామ మాజీ సర్పంచి కోర్సా జలపాలు, కుంజా రవి, కె.రామచంద్రం, పి.దుర్గారావు పాల్గొన్నారు.


రోడ్డును చూపుతున్న సిపిఎం నేతలు

దోమ కాటు పట్ల అప్రమత్తత అవసరం

ఏలూరు సిటీ : దోమ కాటు వల్ల ఆరోగ్యానికి చాలా ముప్పు వాటిల్లుతుందని, దోమ కుట్టకుండా చూసు కోవడం వల్ల అనేక రకాలైన వైరల్ ఫీవర్స్ నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చని అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి జె.గోవింద రావు సూచించారు. స్థానిక ఏలూరు నగరంలోని జెపి కాలనీలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ రోగులతో గోవిందరావు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయని, అవి కుట్టడం ద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా తదితర వైరల్ జ్వరాలు సంక్రమిస్తాయని చెప్పారు. దోమ కాటు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శర్మిష్ట సూచనల మేరకు ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రంలో 63 రకాల రక్త, మూత్ర పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం ఆరోగ్య, విద్య సంబంధించి రోగులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నీలిమ, మలేరియా హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబుల ఆశలపై నీళ్లు..!

పాత ధరలకే మద్యం విక్రయాలు

ప్రజాశక్తి - పోలవరం

మద్యం విషయంలోఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ప్రస్తుతం మందుబాబుల పాలిట శాపంగా పరిణమించాయి. మద్యం ధరలు యధావిధిగా కొనసాగించడం, పాత రకాల మందులు కొనసాగింపు వంటివి మందుబాబుల ఉత్సాహంపై ప్రభుత్వం నీళ్ల చల్లినట్లు అయ్యింది. నూతన మద్యం విధానంలో పాత బ్రాండ్ల లభ్యం కావడంతో పాటు ధరలు తగ్గుతాయనుకున్న మందుబాబులు ఆశలు నిరాశలయ్యాయి. నూతన మద్యం పాలసీ ప్రకారం బుధవారం ఆర్భాటంగా మద్యం షాపులను సిండికేట్లు ప్రారంభించారు. మందుబాబులు భారీగా ధరలు తగ్గిస్తారని ఎంతో ఆశతో షాపులు వద్ద కు వచ్చి అక్కడ ధరలు బ్రాండ్లను చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. షాపులు తెరిచినప్పటికీ పాత ధరలకే, పాత బ్రాండ్లతో మద్యం విక్రయించడంతో మందుబాబులు అవ్వాక్కయ్యారు. ఎన్నికల్లో మద్యం ధరలు తగ్గిస్తామని, నాణ్యమైన, ప్రామాణికమైన మద్యం తీసుకువస్తామని హామీలు గుప్పించారు. అంతేకాకుండా వైసిపి ప్రభుత్వం మద్యం విషయంలో సొంత బ్రాండ్లు పంపి మందుబాబుల ప్రాణాలతో చెలగాటం ఆడిందని ఊదరగొట్టారు. బ్రాండ్లను తక్కువ ధరలకే ఇచ్చేలా కొత్తగా మద్యం పాలసీని తీసుకొస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని మందుబాబులు ప్రశ్నిస్తున్నారు. మద్యం వాహనంలో పాత బ్రాండ్‌లకు సంబంధించిన మద్యాన్ని లిక్కర్ షాపులకు తీసుకొచ్చారు. పోలవరం, గూటాల, ఎల్ఎన్‌డి.పేట గ్రామాల్లో మొత్తం షాపుల పరిస్థితి అలానే ఉంది. షాపులన్నిటికీ పాత బ్రాండ్లే సరఫరా అయ్యాయి. మండలంలోని ఆయా షాపులను దక్కించుకున్న వారందరూ సిండికేట్‌గా ఏర్పాటై మద్యాన్ని అధిక ధరలకు విక్రయించడానికి సన్నాహాలు చేస్తున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరలకు మద్యాన్ని విక్రయించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారనే వాదనలు బలంగా రావడంతో మందుబాబులు రేట్లు పట్ల ఆందోళన చెందుతున్నారు. మరోవైపు మండలంలో పలు గ్రామాల్లో నాటు సారా విక్రయాలు నిరంతరంగా సాగుతున్నాయి. దీంతో అధిక ధరకు మద్యాన్ని కొనుగోలు చేయలేక తక్కువ ధరకు లభించే నాటుసారా తాగడానికి మందుబాబులు ఎగబడుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు ధరలను నియంత్రించడంతోపాటు నాణ్యమైన మద్యాన్ని వినియోగదారులకు అందించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సిఐ ఆర్.సత్యవతిని వివరణ కోరగా పాత మద్యం నిల్వలు అయిపోయేంత వరకు పాత బ్రాండ్లే అమ్ముతారని స్పష్టం చేశారు. ఎంఆర్‌పి రేటు కన్నా ఎక్కువ ధరకు అమ్మినట్లు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. బెల్టుషాపులకు ఎటువంటి అనుమతులు లేవని, నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా రమణారావు



ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్) ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఎన్‌వి.రమణారావు నియమితులయ్యారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసిందని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ ఎన్‌వి.రమణారావు గతంలో వరంగల్ నిట్ డైరెక్టర్‌గా పని చేశారు, ఆయన త్వరలోనే ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపడతారని తెలిపారు. ఇప్పటివరకు ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా హైదరాబాద్ ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బిఎస్.మూర్తి వ్యవహరించారు.

ఐటిఐలో ప్రవేశాలకు 26 వరకు గడువు



ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి స్పామ్ ఐటిఐలో 2024-25 సంవత్సరానికి గవర్నమెంట్ వారి ఉత్తర్వుల ప్రకారం మిగిలిన సీట్లకు ప్రవేశాలు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం పొందేందుకు ఈ నెల 26వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఒక సంవత్సరం కోర్స్ అయిన డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో అతి తక్కువ సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9000620922, 9959350388, 9705405277 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రమణక్కపేట విద్యార్థులు

ప్రజాశక్తి - ముసునూరు

రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ పివిఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ నెల 15వ తేదీన నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఉమ్మడి కృష్ణా జిల్లా ఫెన్సింగ్ అండర్-14 విభాగంలో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు, అండర్ -17 విభాగంలో ఇద్దరు బాలురు, ఒకరు బాలిక మొత్తం ఏడుగురు కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరు త్వరలో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజు తెలిపారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్రకుమార్, డాక్టర్ ఎ.సంతోష్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముసునూరు :వాల్మీకి మహర్షి ఎందరో మహానుభావులకు ఆదర్శనీయుడని ఎంపిడిఒ జి.రాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.

కామవరపుకోట : రావికంపాడు జెడ్‌పిహెచ్ పాఠశాల, వీరిశెట్టిగూడెం ఎంపిపి స్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు, పురుషోత్తం, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ జెడ్‌పి బాలుర హైస్కూల్ ఆవరణలో ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయ అధికారి బిహెచ్.శ్రీనివాస్ మాట్లాడారు.

సదరం స్లాట్లను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఉంగుటూరు

సదరం స్లాట్లను సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు నెలలకు పైగా (ఏప్రిల్ 15వ తేదీకి ముందు) వినియోగించని/హాజరు కాని వారి సదరం స్లాట్‌లు రద్దు చేసినట్లు తెలిపారు. ఎవరైనా స్లాట్ బుక్ చేసుకుని అసెస్‌మెంట్‌కు హాజరు కాకుంటే వారి స్లాట్‌లు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అలాంటి వారు ఇప్పుడు అసెస్‌మెంట్ కోసం తిరిగి మళ్లీ కొత్త స్లాట్‌లను బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

చెట్లను ధ్వంసం చేయొద్దు : సిపిఎం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని వంకవారిగూడెం పంచాయతీలో ఉపాధి హామీలో జరుగుతున్న పనుల్లో రైతులకు చెందిన వ్యవసాయ భూముల్లోని గట్ల వెంబడి ఉన్న చెట్ల వేర్లను ధ్వంసం చేయడం దారుణమని సిపిఎం మండల కార్యదర్శి దుర్గారావు అన్నారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనిలో ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యంగా ఉండటంతో రైతుల వ్యవసాయ భూమిలో ఉన్న చెట్ల వేర్లను పొడుస్తూ పనులు చేస్తున్నారని, కొన్ని రోజులకు అవి ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పనులు రైతులకు ఉపయోగకరంగా ఉండేలా చేయించాలని కోరారు.

'కుల ముద్రకు అతీతం బడేటి కుటుంబం'

ఏలూరు సిటీ :ప్రజాపాలనలో నాలుగు తరాల చరిత్ర ఉన్న బడేటి కుటుంబం కులముద్రకు అతీతమైందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. పవర్‌పేటలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో గురువారం ఎస్‌సి సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంఘ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ సమస్యను ఆయన దృష్టికి సంఘాల నేతలు తీసుకెళ్లగా సమస్యకు పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ కులాలకు అతీతంగా రాజకీయాలు చేస్తేనే ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతామన్నారు.

జీవనోపాధికి భద్రత కల్పించాలి

నూజివీడు టౌన్ :ఆహార దినోత్సవం కార్యక్రమాన్ని ఆకలి రోజుగా జరుపుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉత్పత్తిదారుల యూనియన్ నూజివీడు మండల కో-ఆర్డినేటర్ బి.రంగా అన్నారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో మండల వ్యవసాయ కూలీలు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఎఒకు, తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బి.రంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగం దాని అనుబంధ రంగం కూలీలను నైపుణ్యం గల వర్కర్లుగానే గుర్తించాలన్నారు. ఉపాధి హామీ చట్టంలో ప్రతి కూలీకి జాబ్ కార్డు ఇవ్వాలని కోరారు.

18న ఐఎఫ్‌టియు రాష్ట్రస్థాయి కార్మిక సదస్సు

నూజివీడు టౌన్ :ఈ నెల 18వ తేదీన ఐఎఫ్‌టియు రాష్ట్రస్థాయి కార్మిక సదస్సు విజయవాడ ఎంబివికె భవన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కోశాధికారి మానికల నాగరాజు తెలిపారు. పట్టణంలోని డాక్టర్ ఎంఆర్.అప్పారావు కాలనీలో ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో కార్మిక సంఘ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ అన్ని కార్మిక సంఘాలు హాజరై సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు తిరుపతిరావు, గౌరీ నాయుడు, సురేష్, సీతారాం పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పామాయిల్ లోడు లారీలు..!

చోటు చేసుకుంటున్న ప్రమాదాలు

చింతలపూడి :కామవరపుకోట వైపు నుంచి మండలంలోని సీతానగరం గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీకి అధిక లోడుతో పామాయిల్ లారీలు వెళ్తున్నాయి. దీంతో ప్రగడవరం, పాతిమపురం ఏరియాలో 33 కెవి 11 కెవి విద్యుత్ వైర్లకు లోడు తగులుతుంది. ఇదే విధంగా అధిక లోడుతో వెళ్తున్న లారీ గురువారం ప్రగడవరం సాయిబాబా ఆలయం వద్ద విద్యుత్ వైర్లకు తగిలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. మూడు నెలల కాలంలో ప్రగడవరం పంచాయతీలో పామాయిల్ లారీ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కొన్నిరోజుల క్రితం వైన్ షాపు వద్ద చోటుచేసుకున్న ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. అయినా అధికారులు స్పందించడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

ఐదేళ్లు పూర్తి.. వంతెన అసంపూర్తి..!

- 2018లో జల్లేరు వాగుపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన
- ఇప్పటివరకూ 50 శాతం పనులే
- ఏజెన్సీ ప్రజలు, రైతుల అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


ప్రమాదకరంగా ఉన్న జల్లేరు వాగు ప్రాంతం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీ ప్రాంతం రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు వాగుపై కాజ్ వే సగం కొట్టుకుపోవడంతో వాహనదారులు ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టెన్నపాలెం - రామారావుపేట సెంటర్‌కు మధ్యలో ఉన్న జల్లేరు వాగుపై 2018 టిడిపి హయాంలో రూ.కోట్ల వ్యయంతో హై లెవెల్ వంతెనకు అప్పటి మంత్రి పీతల సుజాత శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఆ వంతెన నిర్మాణం పూర్తి కాలేదు. ఇప్పటివరకు 50 శాతం కంటే ఎక్కువగా పనులు మాత్రమే అయ్యాయి. బుట్టాయగూడెం మండలంలోని గిరిజన ప్రాంతాల్లో గ్రామాలైన రెడ్డిగణపవరం, బెడదనూరు, వెలుతురువారిగూడెం, జగ్గిశెట్టిగూడెం, నాగులగూడెం, అంతర్వేదిగూడెం, కామవరం, పూచికపాడు, అంకన్నగూడెం వంటి గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డు మార్గం ద్వారానే జంగారెడ్డిగూడెం వెళ్తారు. ఈ వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసినప్పుడు ఈ ప్రాంత ప్రజలందరూ బుట్టాయగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లాల్సి వస్తుంది. కొండల్లో ఎక్కువగా వర్షం పడినప్పుడు దొర మామిడి డ్యామ్ గేట్లు ఎత్తడంతో నీరు ఈ జల్లేరు కాలువ ద్వారా వస్తుంది. దీంతో ఈ వంతెన వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రైతులు, ప్రజలు, వాహనదారులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు. అయినా ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మించడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు బ్యారన్ సీజన్ కావడంతో రైతులు పొగాకు బేళ్లను జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి కేంద్రాలకు అమ్మకానికి ఈ మార్గం ద్వారానే తీసుకెళ్తారు. వంతెన నిర్మాణం కాకపోవడంతో వంతెన వద్ద ఎన్నోసార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల్లోని బ్యారన్ రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ హై లెవెల్ వంతెన నిర్మాణం పూర్తి చేసి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రెడ్డి గణపవరం గ్రామంలో దుర్గమ్మ తిరుణాళ్లు జరుగుతాయని, ఈ తిరుణాళ్లకు జంగారెడ్డిగూడెం ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు వస్తారని, వారు ఈ మార్గం గుండానే రావాల్సి ఉందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గుబ్బలమంగమ్మ ఆలయానికి ఈ మార్గం గుండానే వెళ్లాలని, వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో దొరమామిడి మీదుగా వెళ్లాల్సి వస్తుందని యాత్రికులు వాపోతున్నారు. దొరమామిడి రోడ్డు అధ్వానంగా ఉన్నా అటు నుంచే వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు. ఆయా గిరిజన ప్రాంతాల్లో ఏమైనా ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించాలంటే ఈ వంతెన నిర్మాణం చేయకపోవడంతో బుట్టాయగూడెం నుంచి తీసుకెళ్లడానికి ఎక్కువ సమయం పడుతుందని, దీంతో సరైన సమయంలో వైద్య సేవలందక రోగులు ఇబ్బంది పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జల్లేరు వాగుపై వంతెన నిర్మించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

రైతులతో కలిసి ఉద్యమిస్తాం

తెల్లం రామకృష్ణ, గిరిజన సంఘం జిల్లా నాయకులు



గిరిజన ప్రాంత ప్రజలు ఎక్కువగా ప్రయాణించే ఈ మార్గంలో ఉన్న హై లెవెల్ వంతెనను త్వరితగతిన పూర్తి చేయకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ వంతెనను త్వరగా పూర్తి చేయకపోతే ఆయా గ్రామాల్లోని ప్రజలతో రైతులతో కలిసి ఉద్యమిస్తాం. ఈ ప్రాంతాల్లోని ప్రజలు ఏమైనా అనారోగ్యం కారణాల వల్ల జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వంతెన వద్ద ఎన్నోసార్లు ఎన్నో ప్రమాదాలు జరిగినా ప్రభుత్వం ఎందుకు స్పందించడంలేదు. నిర్మాణం ప్రారంభించి ఐదేళ్లు గడిచినా ఎందుకు పూర్తి చేయలేదు. జల్లేరు వాగుపై కల్వర్టు పూర్తిగా పాడైపోయింది. ప్రజలు ఆదమరిచి ప్రయాణిస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

త్వరగా వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

కారం బాస్కర్, గిరిజన సంఘ మండలాధ్యక్షులు



జల్లేరు వాగుపై వంతెనను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలి. జాతీయ రహదారిని సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలి. జాతీయ రహదారి నిర్మాణం ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందునా అప్పటివరకు కాజ్ వే నిర్మాణం చేపట్టి ప్రయాణికులకు ఆటంకం లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానితే.

'అంబేద్కర్ విగ్రహాన్ని అవమానకర రీతిలో తొలగించారు'

ప్రజాశక్తి - ముదినేపల్లి


తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం

ముదినేపల్లి బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని నేషనల్ హైవే అధికారులు అవమానకరంగా క్రేన్‌తో వేలాడదీసి తొలగించడం హేయమైన చర్య అని వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ దళిత నేత నిమ్మగడ్డ బిక్షాలు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గ్రామపంచాయతీకి, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులకు తెలియపరచకుండా గుట్టు చప్పుడు కాకుండా విగ్రహాన్ని తొలగించి తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో పెట్టడం దారుణమన్నారు. దళిత నాయకుని విగ్రహాన్ని నష్టపోయామని అడిగితే చాలా ఎగతాళిగాను, అవమానకరంగాను మాట్లాడుతున్నారన్నారు. శుక్రవారం దళితులందరూ నిరసనగా స్పందించాలని భిక్షాలు కోరారు.

ట్రూ అప్, సర్దుబాటు విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ట్రూ అప్, సర్దుబాటు కరెంటు ఛార్జీలు రద్దు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. సిపిఎం నగర కమిటీ సమావేశం కె.రామాంజనేయులు అధ్యక్షతన సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.కిషోర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగంలో అమలవుతున్న ట్రూ అప్, సర్దుబాటు కరెంటు ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఏలూరులో జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఈ సమావేశంలో నగర కమిటీ సభ్యులు బి.జగన్నాధరావు, వివిఎన్.ప్రసాద్, జి.రవికిషోర్, వైఎస్.కనకారావు, ఎం.అరుణకుమారి పాల్గొన్నారు.

25న కామవరపుకోటలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కామవరపుకోట :ఈ నెల 25వ తేదీన కామవరపుకోటలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని టిడిపి మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ అన్నారు. ఎంపిడిఒ సరళకుమారి, తహశీల్దార్ ఎలీషా ఆధ్వర్యంలో మండలంలో అన్ని శాఖల అధికారులతో ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

వికలాంగులకు కృత్రిమ కాళ్లు

ఆగిరిపల్లి :వికలాంగులకు ఆర్థిక వితరణ ద్వారా కృత్రిమ కాళ్లను అందించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించి, వైకల్యాన్ని అధిగమించి జీవనోపాధి కొనసాగించేలా చేయవచ్చని విజయవాడ నగరపాలక సంస్థ 23వ డివిజన్ కార్పొరేటర్, టిడిపి ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి అన్నారు. హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ముగ్గురు వికలాంగులకు నెలిబండ్ల శైలజ, ఖాత, సువర్ణ, నవనిర్మాణ్ గ్రూప్ డైరెక్టర్ అప్పలవెంకటసాయినాథ్‌ల ఆర్థిక సాయంతో గురువారం కృత్రిమకాళ్లను అందించారు.

ఏలూరును బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - ఏలూరు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో గురువారం మిషన్ వాత్సల్య రెండో త్రైమాసిక సమావేశం కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ బాల్య వివాహాలపై సమాచారం అందించేందుకు జిల్లా అంతటా కూడా 1098 టోల్ ఫ్రీ నెంబరును మరింత విస్తృత పరచాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్క పౌరుడు చైతన్యవంతులు కావాలని, దానికి అనుగుణంగా ప్రతి పబ్లిక్ ప్రదేశాల్లో కూడా 1098 నెంబర్‌ను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొన్ని హాస్టల్స్‌ను తనిఖీ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. హాస్టల్స్‌లోనూ మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా ఉండాలని సూచించారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా అందిస్తున్న స్పాన్సర్‌షిప్ ద్వారా నిరాదరణకు గురైన పిల్లలకు నెలకు రూ.నాలుగు వేలు అందించే పథకానికి లబ్ధిదారులు ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారిని కూడా ఈ పథకానికి అర్హులుగా ఆదేశించారు. ఈ సమావేశంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి కెఎల్‌వి.పద్మావతి, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్ కుమార్, ఎల్‌డిఎం డి.నీలాద్రి, డిఇఒ ఎస్.అబ్రహం, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ట, సోషల్ వెల్ఫేర్ జెడి వి.జయప్రకాష్, జిల్లా ప్రోహిబిషన్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, సిపిఒ బి.శ్రీదేవి, డిఎస్‌డిఒ శ్రీనివాసరావు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి బి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

విఆర్‌ఎలకు కనీస వేతనం అమలు చేసి, నామినీలను రెగ్యులర్ చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో విఆర్‌ఎల సమావేశం పోచారపు వెంకన్నబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వానికి తెలియజేస్తూ గ్రామాలను కాపాలకాస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ గడవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించకుంటే రానున్న కాలంలో అందరిని ఐక్యం చేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు మండల సహాయ కార్యదర్శి కాకర్ల శ్రీను, విఆర్‌ఎ యూనియన్ కార్యదర్శి కూరకుల మోహన్‌రావు, విఆర్‌ఎలు మారుతి, సుజాత, భూక్య చందు, శంకర్, శ్రీనాద్, ఇరకం రాజు, చినరాజు, మధు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణా శిబిరాలను వినియోగించుకోండి

భీమడోలు :మహిళాభ్యున్నతికి, యువజనులైన మహిళలను ఔత్సాహిక వ్యాపారవేత్తలు, వివిధ వస్తువుల ఉత్పత్తిదారులుగా తయారు చేసేందుకు బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ ఇస్తున్న ఉచిత శిక్షణా శిబిరాల సేవలను వినియోగించుకోవాలని ఆ సంస్థ సహాయ డైరెక్టర్ డి.శ్రీనివాస్ కోరారు. భీమడోలులో శ్రీ సత్యసాయి సేవాసమితి, భీమడోలు శాఖ ఆధ్వర్యంలో మహిళలకు క్షేత్రస్థాయిలో స్థానికంగా జర్దోసి, మగ్గం వస్తువుల తయారీపై ఏర్పాటుచేసిన ఉచిత శిక్షణా శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 2007 నుంచి 822 బ్యాచ్‌లకు చెందిన 24,500 మందికి వివిధ అంశాల్లో శిక్షణా కార్యక్రమ సేవలను అందించిందన్నారు. ప్రస్తుతం భీమడోలులో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరం మహిళలకు ప్రత్యేకమని, శిక్షణ కార్యక్రమాలు నేటి నుంచి నవంబర్ 29వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ భీమడోలు శాఖ మేనేజర్ ఎస్.రమేష్, కెనరా బ్యాంక్ భీమడోలు శాఖ మేనేజర్ శివకృష్ణ, భీమడోలు గ్రామపంచాయతీ కార్యదర్శి కె.తనూజ, శ్రీసత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమ ఇన్‌ఛార్జి కె.నాగప్రసాద్, భీమడోలు విభాగం ప్రతినిధి వర్ధినీడి సత్యసాయి పాల్గొన్నారు.

గ్రామసభలకు అధికారులు సమాయత్తం కావాలి

ప్రజాశక్తి - మండవల్లి

రీ సర్వేపై నిర్వహించే గ్రామసభలకు అధికారులు సమయత్తం కావాలని ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి నెలా పదో తేదీ నాటికి రేషన్ సరుకులు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలన్నారు. నెలకు ఒక్కసారైనా తనిఖీలు పర్యవేక్షించాలని, రైస్ మిల్లులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని చెప్పారు. నాణ్యత లోపం ఉన్న విత్తనాలు అమ్మే షాపులపై తనిఖీలు చేసి యజమానులపై చర్యలు తీసుకుని తగు నివేదికను సమర్పించాలన్నారు. పిజిఆర్‌ఎస్ ద్వారా రీ ఓపెనింగ్ కేసులు ఎక్కువగా వస్తున్నాయని వీటిని అధిగమించడానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు.

టి.నరసాపురం : మండలంలో రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కార నిమిత్తం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ టిఎస్.సాయిబాబా తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి 25వ తేదీ మండలంలోని అప్పలరాజుగూడెం, కొల్లివారిగూడెం, కృష్ణాపురం, వాకాలపూడి, రామన్నపాలెం, గుడ్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ గ్రామసభల ద్వారా సర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో భూ యజమానుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, భూ సంబంధమైన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

జీలుగుమిల్లి : మండలంలోని తొమ్మిది రెవెన్యూ గ్రామాల పరిధిలో భూ సమస్యలపై 18వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ బి.సందీప్ తెలిపారు. 18న బొత్తప్పగూడెం, 19న పి.అంకంపాలెం, 22న నేర్సుగూడెం, 23న దానంవారిగూడెం, 24న ములగలంపల్లి, 25న కంద్రికపాడు, 26న రామన్నపాలెం, 29న పి.రాజవరం, 30న స్వర్ణవారిగూడెంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

'పల్లె పండుగ'లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతిపల్లె అభివృద్ధిలో ముందుండాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.కోట్ల ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

భీమడోలు : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, బిటి రోడ్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు తెలిపారు. మండలంలోని సూరప్పగూడెం, చెట్టున్నపాడు, ఆగడాలలంక, లక్ష్మీపురం, కోరుకొల్లు, గుండుగొలను గ్రామాల్లో రూ.2.17 కోట్ల ఉపాధి నిధులతో నిర్మించనున్న రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రత్నాపురంలో రూ. 25 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు.

జీలుగుమిల్లి : పల్లెలను ప్రగతి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నట్లు పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు తెలిపారు. మండలంలోని జీలుగుమిల్లి, తాటియాకులగూడెం పంచాయతీల్లో పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12 పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఉపాధి హామీ చట్టం నిధుల నుంచి సుమారు రూ.ఆరు కోట్ల నిధులను కేటాయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

దెందులూరు : దెందులూరు నియోజకవర్గంలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలంలోని మాదేపల్లి, చాటపర్రు గ్రామాల్లో గురువారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. చాటపర్రు గ్రామంలోని యాదవుల పేటలో రూ.14లక్షలతో ఎంపిపి స్కూల్ నుంచి బాబుఖాన్ గూడెం వరకు నిర్మించనున్న బిటి రోడ్డు, మాదేపల్లిలోని బిసి కాలనీలో మరో రూ.తొమ్మిది లక్షలతో నిర్మించనున్న డబ్ల్యూబిఎం రోడ్ల నిర్మాణ పనులకు స్థానిక కూటమి నాయకులు, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు.

మండవల్లి : పల్లెలను సుందరంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని అయ్యవారిరుద్రవరం, గన్నవరం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గుడివాడ వరప్రసాద్ (చిట్టిబాబు), సర్పంచి మెండ ఝాన్సీ, ముళ్లపూడి సత్తిబాబు, నల్లిపోయిన రాజేష్, గుడివాడ మురళి, కారి రాజు, గుడివాడ గణేష్ పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని కోరుకొల్లులో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సర్పంచి బట్టు లీలా కనకదుర్గామహేష్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి తోట రమాదేవి, మాజీ ఎంపిపిలు మురళీకృష్ణ, వలవల రామారావు, నాయకులు పాల్గొన్నారు.

కామవరపుకోట ఎంపిడిఒగా సరళకుమారి

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట ఎంపిడిఒగా ఇఒపిఆర్‌డి ముళ్లగిరి సరళకుమారికి పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఏలూరు జిల్లా పరిషత్ సిఇఒ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన ముళ్లగిరి సరళకుమారిని మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

జెడ్‌పి బాలికల హైస్కూల్లో మాక్ పోలింగ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలోని జెడ్‌పి హైస్కూల్‌లో బాలికలకు గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సోషల్ అసిస్టెంట్ ఎం.సలోమి మాట్లాడుతూ 6, 7 తరగతులకు చెందిన బాలికలకు ఎన్నికలపై అవగాహన కోసం మాక్ పోలింగ్ నిర్వహించినట్లు చెప్పారు.

మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు

ముసునూరు :మండలంలోని కాట్రేనిపాడు, ముసునూరు గ్రామాల్లో ఉన్న మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు ఉచితంగా వేసినట్లు పశు వైద్య శాఖాధికారి వెంకట్ చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గద్దల మోహన్‌రావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, సూర్యదేవర శ్రీనివాసరావు, కొండేటి బాబి, నక్క యోహాన్, తోట శ్రీనివాసరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.